జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా

సంపుటి - 07 | సంచిక 23 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 24, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

శివమెత్తిన.. శివధర్‌రెడ్డి

దట్ ఈజ్ డిజిపి డ

పోలీసు అధికారులపై వరుస చర్యలతో కదంబొక్కుతున్నారు.

సామాన్యులు ఉన్నతులు పోలీస్ చట్టాల ముందు సమానమని నిరూపిస్తున్నారు.

కిందిస్థాయి అధికారులతో కలతప్పుతున్న పోలీసు వ్యవస్థను గుర్తిస్తున్నారు.. కేసులన్నీ సాధారణ ప్రజలపైనే.

లాకప్ డెత్ లతో బలైపోతున్నది ఎస్సీలే.

ఉద్యమాలు మోస్తున్నది ఎస్సీ ఎస్టీ బీసీలే.

పదవుల కాడ అధికారం కాడ ఎక్కడ కానరాన్ని బహుజనులు.

పోలీసులు కడుతున్న ప్రతి కేసును ప్రజాక్షేత్రంలో పాందుపరచాలి.

పోస్టింగ్లలో పైరవీరులు లేకుండా చేస్తే చాలు పోలీసు వ్యవస్థ మెరుగుపడినట్టే : డాక్టర్ బరిగెల శివ.

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

పోలీసు చట్టాలపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ రక్షణ కల్పించడంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ మరొకసారి తన గొప్పతనాన్ని చాటుకుంటున్నారని డాక్టర్ బరిగెల శివ విశ్వాసాన్ని ప్రకటించారు.అనాదికాలం నుండి పేదవాళ్లు సాధారణ ప్రజలు ఉద్యమాలను అంటిపెట్టుకుని జీవిస్తూ అనేక కేసులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ 11 సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలే ఎక్కువ శాతం కేసులో పాలై జీవితాలను చాలిస్తున్నారని రాష్ట్రస్థాయి పోలీసు వ్యవస్థను నడిపే పలువురు డిజిపి స్థాయి అధికారులు తెలంగాణ రాష్ట్ర పోలీసు వ్యవస్థను అనుకున్న స్థాయిలో చక్కపరచలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర డిజిపిగా కొనసాగుతున్న డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ రాష్ట్ర ప్రజల యోగక్షేమాలను తనదైన శైలిలో ముందుకు తీసుకుపోతున్నారని క్రైం రేటును తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని జిల్లాల్లోని పోలీసు ఉన్నత అధికారులతో ఎప్పటికప్పుడు వీడియో కాన్ఫరెన్స్ లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర పోలీసు పరిపాలనలో విభిన్నమైన మార్పులు తీసుకొచ్చే విధంగా తన విధులను సమర్థవంతంగా

- మిగతా 2లో..

మంత్రులతో ముగిసిన సీఎం రేవంత్ సమావేశం

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై కీలక అప్డేట్

హైద్రాబాద్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించి ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, తదుపరి దశగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మంత్రులతో కీలక సమావేశం నిర్వహించి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లా పరిషత్ పీఠాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహాలు, రాజకీయ పరిస్థితులపై సమీక్ష చేసిన సీఎం రేవంత్ రెడ్డి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే పాలమూరు%–%రంగారెడ్డి ప్రాజెక్టు అంశంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను బలంగా తిప్పికొట్టాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.

కెసిఆర్ ధోరణి మార్చుకో

తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు

అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు

ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి

2

మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్) :

భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని సిఎం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

అక్రిడేషన్ కమిటీల్లో యూనియన్లకు ప్రాతినిధ్యం

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడేషన్ ల జారీ కోసం నూతన మార్గదర్శకాలతో జి.వో. జారీ చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీలో యూనియన్ల ఎంపిక కోరకు మంగళవారం పత్రిక నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన జర్నలిస్టు యూనియన్లు ఈ నెల 29వ తేదీ లోపు సమాచార శాఖ కమిషనర్‌కు తమ ప్రతిపాదనలను అవసరమైన ధ్రువపత్రాలతో పాటు సమర్పించాల్సిందిగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారం వెండి ధరలు మరంత దూకుడు

భారీగా పెరిగిన ధరలు

7

ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈ నెలాఖరు నుంచే కుటుంబ సర్వే

ప్రజల సమగ్ర వివరాలు సేకరణ

ప్రభుత్వ పథకాల పారదర్శక అమలుకు నిర్ణయం

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

యు.జి.సి. నెట్, టి.జి.సెట్, టి.జి.టేట్ నేపథ్యంలో కేయూ పి.జి. మూడవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

యు.జి.సి. నెట్, టి.జి.సెట్, టి.జి.టేట్ వంటి ముఖ్యమైన పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, జనవరి 3వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయ పి.జి. మూడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సమగ్రంగా సిద్ధమయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాయిదా పడిన పి.జి. మూడవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన సవరించిన షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, విశ్వవిద్యాలయం నుంచి వచ్చే తదుపరి ప్రకటనలను అనుసరించాలని ఆయన సూచించారు.

మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమానికి విశేష స్పందన

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు వారసులకు అందించడమే లక్ష్యం
ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ జిల్లా, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

జాతీయ ప్రాంతీయ బ్యాంకుల్లో పదేళ్లకు పైబడిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను సంబంధిత ఖాతాదారుల వారసులకు అందించేందుకు జిల్లా లీడ్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "మీ డబ్బు %-% మీ హక్కు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మంచి స్పందనను పొందింది. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ముత్యాల గణన్ సుప్రభాత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి గంట కమలాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ, "మీ డబ్బు %-% మీ హక్కు కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉంటే, నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి వాటిని పొందవచ్చని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా కేవైసీ, ఈ-కేవైసీ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుతం డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల పేరుతో మోసాలు పెరుగుతున్నాయని, అందువల్ల బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, సందేశాలకు స్పందించవద్దని ఆమె హెచ్చరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ముత్యాల గణన్ సుప్రభాత్ మాట్లాడుతూ, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను రైట్ ఫుల్ వారసులకు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బ్యాంకులు, ఆర్బీఐ సంయుక్తంగా ఈ ప్రక్రియను సులభతరం చేస్తున్నాయని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి గంట కమలాకర్ మాట్లాడుతూ, మీ డబ్బు %-% మీ హక్కు కార్యక్రమంలో భాగంగా సుమారు 50 మంది నామినీలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన బ్యాంకు అంగీకార పత్రాల మొత్తాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలి రాజు మాట్లాడుతూ, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఖాతాదారులు ముందుకు వచ్చి తమకు లేదా తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై సమాచారం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి అండ్ బిఆర్ఎం జీపీఎస్ చైతన్య కుమార్, నాబార్డ్ జిల్లా మేనేజర్ తంగ రవి, ఎస్ఎల్‌బీసీ ప్రతినిధి పి. ప్రకాష్‌తో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్

4న సమావేశం ఏర్పాటు: కవిత

యాదాద్రిభువనగిరి,డిసెంబర్23(జై భీమ్ న్యూస్) :

జనవరి 4న ఎనమిది జిల్లాల్లోని ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. బీబీ నగర్ లోని ఎయిమ్స్ ను ఆమె సందర్శించారు. అనతంరం కవిత మాట్లా డుతూ.. రైతులను జైలును పంపించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఆ ప్రభుత్వంలో నేను ఉన్నాను. నాకు తెలియదు కావున నేను రాయగిరి రైతులను క్షమాపణలు కోరుతున్నాను. రాయగిరి రైతులు ఇప్పటికే చాలాసార్లు భూములు ఇచ్చి ఉన్నారు. కావున అలైన్మెం ట్ మార్చాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతా.. కేంద్రమంత్రి గడ్కరీని కలుద్దాం అని అన్నారు. పెద్దల భూములు కాపాడేందుకు చిన్న సన్నకారు రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. మరోవైపు ఎయిమ్స్ లో ఎమర్జెన్సీ మెడిసిన్ దొరకే పరిస్థితి లేదన్నారు. అన్నారు. భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ల అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టి సారించి ఎయిమ్స్ కాంట్రాక్టర్లు ఒత్తిడి తెచ్చిన నిర్మాణా లు పూర్తి చేయాలన్నారు.

శివమెత్తిన శివధర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తున్నారని తెలిపారు.చాలాచోట్ల పోలీసు అధికారులు విచ్చలవిడిగా కేసులు పెడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాష్ట్ర ఇంటలిజెన్స్ వర్గం ప్రభుత్వానికి స్పష్టమైన నివేదికలు ఇస్తున్నప్పటికిని అలాంటి అక్రమ కేసుల పరంపరను అరికట్టడంలో పోలీసు అధికారులు పోలీసు వ్యవస్థ చాలా సందర్భాల్లో విఫలమైనారని దానికి అనుగుణంగా రాజకీయ నాయకులు వాళ్లకి అనుకూలమైన అధికారులను విటమిన్ ఎం తీసుకొని పోస్టింగులు కల్పిస్తుండడం వల్ల పోలీసు వ్యవస్థ ఈ రీతిగా తయారైందని స్పష్టం చేశారు.పోలీస్ చట్టంలో అధికారికంగా రాజకీయ నాయకుల ఉత్తరాలతో పోస్టింగులు కల్పించాలని ఎక్కడ లేనప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి నేటి వరకు రాజకీయ నాయకుల సిఫారసు లేఖలతోనె పోస్టింగులు కల్పిస్తుండడం వల్ల పోలీసు వ్యవస్థ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయన్నారు.పోలీస్ పోస్టింగ్లలో పైరవీరులు లేకుండా చేస్తే పోలీసు వ్యవస్థ బాగుపడినట్టేనంటూ గుర్తు చేశారు.ఏ పోలీస్ అధికారైన అక్రమ కేసులు కట్టే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉద్యోగ ధర్మం నిర్వహిస్తే బాగుంటుందని అలా జరగకపోవడం వల్లనే రాష్ట్ర డిజిపి స్థాయి లాంటి పోలీసు ఉన్నత అధికారి పోలీసు వ్యవస్థను సక్రమమైన పద్ధతిలో పెట్టడానికి ఇంతలా అహర్నిశలు శ్రమించాల్సి వస్తుందన్నారు.అసలే పోలీస్ కొత్త చట్టాలు పోలీసులకు అనుగుణంగా ఉన్నాయని ప్రజలు అక్కాసు వెళ్ళగకుతున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కట్టబడుతున్న పోలీస్ కేసులు విచారణ ఆధారంగా కట్టబడితే ఎలాంటి సమస్యలు తలెత్తేవి కాదని ఆ వైపుగా రాష్ట్ర పోలీస్ బాస్ ప్రణాళికలు సిద్ధం చేసి పోలీసు వ్యవస్థను సమాయత్త పరుస్తుండడం గొప్పతనం అన్నారు.పోలీసులు కడుతున్న ప్రతి కేసు ప్రజాక్షేత్రంలో పొందుపరచబడేలా చర్యలు చేపట్టబడాలని అలాంటప్పుడే సాధారణ ప్రజలపై అక్రమంగా కట్టబడుతున్న కేసులు ఏ విధంగా కట్టబడుతున్నాయో ప్రజలందరూ తెలుసుకునే వెసులుబాటుతోపాటు కేసులు కట్టిన విధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించబడుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర పోలీస్ బాస్ రాజకీయపరమైన అధికారంతోపాటు పైస బలుపుతో ఉన్న వాళ్లను వంచుతున్నారని సామాన్య ప్రజలు భావిస్తున్నారన్నారు అధికారం అడ్డం పెట్టుకొని ప్రజలను వేధించే వాళ్ళ భరతం పడుతున్నారని రాష్ట్ర పోలీసు వ్యవస్థపై ఎన్నడూ లేని విధంగా ప్రజలకు నమ్మకం కలుగుతుండడం పట్ల కేవలం డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్ ముఖ్య కారణమన్నారు.సామాన్యుల రక్షణ కోసం పాటుపడాలని ఆలోచన సాధారణంగా ఉన్నత అధికారులకు కలగదని దానికి పూర్తి భిన్నంగా సామాన్య ప్రజల రక్షణార్థమై అహర్నిశలు ముమ్మర ప్రయత్నం చేస్తున్న డిజిపి రాష్ట్ర క్రైమ్ రేట్ ను తగ్గించే పనిలో నిమగ్నమై నిష్ణాతను ప్రదర్శిస్తున్నారన్నారు.కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు డీజీపీ మార్గంలో నడుస్తున్నందువల్ల ప్రజలకు పోలీస్ వ్యవస్థపై ఇప్పుడిప్పుడే ఎక్కడలేని నమ్మకం కలుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎక్కువ కేసులు నమోదు చేయబడుతున్నాయని వాటితోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన నాయకులు ఎక్కువ శాతం భూకబ్జాలకు పాల్పడుతున్నారని వాటిని ఎలాగైనా కట్టడి చేయడం కోసం పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర పోలీస్ బాస్ రాబోయే కొత్త సంవత్సరంలో నూతన కార్యాచరణను అవలంబించబోతున్నారని విశ్వాసనీయ సమాచారం అన్నారు.కలతప్పిన పోలీసు వ్యవస్థను కదంలోనికి నడిపించడానికి కదనరంగం నడిపిస్తున్నారన్నారు.పోలీస్ చట్టాలకు సామాన్యులు ఉన్నతమైన వాళ్ళు అందరూ సమానులే అనే భావన ప్రజల్లో కల్పించబడడానికి రాష్ట్ర పోలీస్ బాస్ తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.ప్రతి జిల్లాలో రాజకీయ ఉత్తీర్లతో కూడిన అక్రమ కేసులు లాఠీ చార్జీలు లాకప్ డెత్ లు పోలీసు వ్యవస్థను కలవర పెడుతున్నాయని వాటన్నిటిపై కూడా రాబోయే రోజుల్లో ప్రత్యేకమైన మార్పు తీసుకురాగల సమర్థవంతమైన పరిపాలనను అందించడానికి రాష్ట్ర పోలీస్ బాస్ శ్రమించగలరని బలమైన, దృఢమైన నమ్మకం రాష్ట్ర ప్రజలకు ఉందన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్లో రోజువారీగా కట్టబడుతున్న కేసులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మరొక్కసారి రాష్ట్ర పోలీస్ బాస్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ ఒత్తిళ్ళతో కూడిన కేసులు,పైసా ప్రభావంతో కట్టబడుతున్న కేసులు,భూ కబ్జాల విషయాలలో ఏకపక్షంగా సామాన్యుల పాలిట శాపంగా కట్టబడుతున్న కేసులు విపరీతంగా పెరిగిపోతూ కొంతమంది పోలీసులు పోలీస్ వ్యవస్థను అభాసుపాలు చేస్తున్నారని అలాంటివి చాలా సంఘటనలు పోలీస్ బాస్ దృష్టికి రావడంతో వాటిని ఏ విధంగానైనా నియంత్రించాలని, నిర్మూలించాలని ప్రజల పక్షాన నిలబడే విధంగా పోలీస్ వ్యవస్థ జవాబుదారీతనాన్ని ప్రదర్శించే విధంగా రూపుదిద్దాలని పోలీస్ బాస్ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.చాలాచోట్ల పోలీసులే అక్రమ భూకబ్జాలలో తలదూరుస్తూ అక్రమంగా కేసులు కడుతూ సామాన్యులను వేధిస్తూ ఉండగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారుతున్న పోలీస్ అధికారుల సస్పెన్షన్ వేటు పోలీస్ వ్యవస్థలో కలవరం రేపిందన్నారు.సామాన్య ప్రజలకు గౌరవం ఇచ్చే విధంగా పోలీస్ వ్యవస్థను రూపుదిద్దడమే పోలీస్ బాస్ లక్ష్యంగా పెట్టుకున్నారని సర్వ మతాలకు సమాన రక్షణ కల్పించడానికి అనుకున్న స్థాయిలో శాంతిభద్రతలను రక్షిస్తూ దానిని పోలీస్ వ్యవస్థ అదుపులో ఉంచడానికి పోలీస్ అధికారుల జవాబుదారి తనమే సమాజానికి సమాధానం చెప్పే విధంగా నిలబడాలని పోలీస్ బాస్ ఆశిస్తున్న నిజమైన పోలీసు వ్యవస్థను చూడ గలగనందులకు తెలంగాణ ప్రజలు వివిధ పార్టీల నాయకులు ఆతృతంగా ఎదురుచూస్తున్నారు అన్నారు.ప్రజారక్షణ కోసం కట్టుబడి ఉన్న పోలీస్ అధికారుల గౌరవం అక్రమాలకు పాల్పడుతున్న పోలీస్ అధికారుల గౌరవం ప్రజాక్షేత్రంలో ఎలాంటి పరిణామాలను చూపిస్తుందో ప్రస్తుతం పోలీసు అధికారులపై జరుగుతున్న చర్యలు పోలీస్ అధికారుల సస్పెన్షన్ పరంపర కొనసాగించబడుతూనే ఉంటుందని ఇకనైనా అక్రమ పోలీస్ కేసులు కట్టే అధికారులు అధికారాన్ని మర్చిపోయి ప్రజాసేవకు పాటుపడాలని పరోక్ష హెచ్చరికలు చేశారు.

కమ్మని సౌకర్యాలతో చక్కని ఉద్యోగి

కదలడు వదలడు ఆస్తుల సంపాదన వేటను వీడడు
కిరణ్ పలుకుబడి పెద్దది ప్రశ్నిస్తే తొక్కేస్తాడు
కిరణ్ పై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ కమిటీ ఎటుపాయే
కిరణ్ ఉద్యోగ ధర్మం భక్తికన్నా బాదుడుకే విలువనిస్తున్నాడు
రాజకీయ పలుకుబడితో సామాన్యులను వేధిస్తున్నాడు

హనుమకొండ, (జై భీమ్ న్యూస్)

మల్లన్న ఆలయ జూనియర్ అసిస్టెంట్‌అద్దంకి కిరణ్ ఆస్తులు ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించాడని పలుమార్లు అభియోగాలు వెలువడినప్పటికీ రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం వెనకాల రాజకీయ ఒత్తిళ్లె కారణమని ఆలయ భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న అద్దంకి కిరణ్ సంవత్సరాలకు తరబడి అదే కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ తనకు ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి పలు రకాల ఆస్తులు సంపాదించాడని పెద్ద ఎత్తున విమర్శలు కలవు గతంలో ఇతనిపై రాష్ట్ర ఎండోమెంట్ శాఖ కార్యాలయంలో విచారణ జరినప్పటికీ అధికారులను కాకా పట్టి తన కేసును మాఫీ చేసుకొని అదే స్థానంలో ఉద్యోగం చేస్తూ అవినీతి ఆస్తులు సంపాదిస్తూ తనకు తిరుగు లేదని సవాల్ విసురుతున్నాడు భగవంతుని ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సాధారణ జూనియర్ అసిస్టెంట్ అద్దంకి కిరణ్ కు ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించడం ఎలా సాధ్యమైందని అధికారులే ఆశ్చర్యపోతున్నారు ఇటు రాజకీయం అటు అధికారం తనకు అనుకూలంగా ఉన్న ఒకరు ఇద్దరు ఆలయ అర్చకులను గుప్పిట్లో పెట్టుకొని ఉన్నతాధికారుల సైతం శాసించే స్థాయికి ఎదగగాలిగాడు తనను ప్రశ్నిస్తున్న వాళ్లపై కేసులు పెడుతూ తనను విమర్శిస్తే ఎంతటి స్థాయికి అయిన దిగజారి కక్షా కడతాడని పలుమార్లు రుజువు చేయబడ్డాయి. గతంలో ఆలయంలో దొంగతనం జరిగిందని ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా విపరీతమైన ప్రచారం చేసినప్పటికిని దానిపై సమగ్ర విచారణ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలను మాయం చేసినట్లుగా లోలోపల మంతలను జరుపుకొని అట్టి దొంగతనం కేసును వాళ్లకు వాళ్లే మాఫీ చేసుకున్నారు.అద్దంకి కిరణ్ గుంజేడులో తాగి గంతులు వేశాడని భక్తుల దృష్టికి వచ్చినప్పుడు ఆలయ ప్రతిష్టను మంట కలుపుతూ దైవభక్తిని తాగుడుకు ఫణంగా పెట్టి సెలవులలో ఉన్నానని ఏమైనా చేసుకుంటానని తనను ఎవడు అడగొద్దని తనను ఎవడు ప్రశ్నించొద్దని తప్పుడు సెలవు పత్రాన్ని సిద్ధపరచుకొని రికార్డులను నమోదు చేసుకొని పలు విధాల తప్పిదాలకు పాల్పడ్డాడు.తాగి తూలినప్పుడు లేని ప్రతిష్ట ప్రశ్నించే కాడ రావడం కిరణ్ కే చెల్లుబాటు అవుతుందని పలువురు మేధావులు తీవ్ర ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతం ఆలయంలో తనదే ఆధిపత్యం అంటూ ఎవరైనా తన మాట వినాల్సిందేనంటూ లేదంటే తన అధికార ప్రతాపం రాజకీయ ప్రతాపం తనలో ఉన్నటువంటి కక్షల కోణాలను బయటపెడుతూ ఏమైనా చేయగలనని ఉద్యోగులను విపరీతంగా భయపెట్టిస్తున్నట్లు గ్రామస్తులు మండలస్తులు భక్తులు తీవ్ర కోపంగా ఉన్నారు. ఇవన్నీ చేస్తున్నప్పటికీ తన కుర్చీకి డోకా లేదనే విధంగా రాజకీయ ప్రతాపాన్ని కనపరుస్తున్న అద్దంకి కిరణ్ ఆదాయానికి మించిన ఆస్తులపై విచారణ ఎప్పుడు చేస్తారంటూ భక్తులు పెద్ద ఎత్తున మొత్తుకుంటున్నారు. గతంలో కిరణ్ పై జరిగిన విచారణతో పాటు ఆలయ అధికార పదవిని అడ్డం పెట్టుకొని ప్రత్యక్షంగా పరోక్షంగా సంపాదించుకున్న సొమ్ము పై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి తక్షణమే చర్యలు చేపట్టాలని రాజకీయ నాయకులను దేవదాయ శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వ పెద్దలను భక్తులు వేడుకుంటున్నారు. ఆలయంలో సంపాదన సౌలభ్యంగా ఉన్నందునే కిరణ్ కుర్చీ ఇంచు కూడా కదలకపోవడం మరో అద్భుతంగా తను భావించుకుంటున్నాడు. ఇకనైనా ఆలయ ప్రతిష్టను కాపాడుకోవడం కోసం విచారణ కొనసాగించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని భక్తులు భావిస్తున్నారు దానికి కిరణ్ ప్రతీయేట ఆలయ లావాదేవీలలో లెక్కలు చేసిన విధానాలపై ఆడిట్ రూపొందించిన విధానంపై రికార్డుల సొమ్ము వాటికి జతపరిచిన బిల్లుల సొమ్మును క్షేత్రస్థాయిలో పరిశీలించి అవినీతిపై లెక్కలు తేల్చాలని విశ్వాసులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులతోపాటు ఆలయ కమిటీ సభ్యులు తక్షణమే స్పందించి అవినీతి అరాచకాలను అరికట్టాలని కోరుతున్నారు.

దమ్ముంటే నాపై విచారణ చేయండి అతి త్వరలో

సబ్‌రిజిస్టార్ కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

అమరావతి,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

ఏపీలోని పలువురు సబ్‌రిజిస్టార్ కార్యాలయాల్లో ఎసిబి సోదాలు చేపట్టింది. అలాగే సిబ్బందికి సంబంధించిన 14 నివాస ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. అవినీతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 5, 6 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు సబ్‌రిజిస్టార్ కార్యాలయాల్లో అనిశా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 4 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి మంగళవారం పలుచోట్ల అనిశా అధికారులు సోదాలు చేపట్టారు.విశాఖలోని జగదాంబ సెంటర్‌లో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహన్‌రావు, ఇద్దరు సిబ్బందికి చెందిన మొత్తం 4 చోట్ల అధికారులు సోదాలు చేపట్టారు. విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ, ఐదుగురు సిబ్బంది నివాస ప్రాంతాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. అనంతపురం జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌ఛార్జి మీనుల ప్రసాద్ బాబు, సీనియర్ అసిస్టెంట్, ఆ కార్యాలయంలోని ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన నివాస ప్రాంతాల్లో అనిశా సోదాలు నిర్వహించింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న షేక్ మహమూద్, సీనియర్ అసిస్టెంట్, మరొక సిబ్బందికి చెందిన రెండు నివాస ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు.

ప్రభుత్వ ఆసుపత్రికి పట్టిన రోగం

రాయపర్తిలో వైద్య సేవల కరువు

జై భీమ్ న్యూస్ (రాయపర్తి):

జ్వరం వచ్చినా పట్టించుకునే నాథుడే లేడు.. కడుపు నొప్పి, కాలు వాచినా కనికరించే చేయి కనిపించదు.. ఇది రాయపర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి దయనీయ స్థితి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు కరువవడంతో మండల, గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని అక్కడికి వచ్చిన బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేళ్లల్లో జీతాలు తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారే తప్ప మా గోడు వినేవారే లేరని, మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న డాక్టర్ల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే%% రాయపర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి చూస్తే ఆసుపత్రికే రోగం పట్టిన దుస్థితి కనిపిస్తోంది. సంవత్సరాలు గడిచినా కనీసం ఒక శాశ్వత డాక్టర్‌ను నియమించడంలో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఆసుపత్రిపై పత్రికల్లో అనేక కథనాలు ప్రచురితమవుతున్నా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఎప్పుడైనా పట్టించుకున్నా డిప్యూటేషన్ పేరుతో కాలం వెల్లబుచ్చుతున్నారే తప్ప శాశ్వత వైద్యులను నియమించడంలో ముందడుగు పడటం లేదు. దవాఖానలో డిప్యూటేషన్ మీద వచ్చే డాక్టర్లు కూడా వారానికి ఒక్కసారి వచ్చినట్టే వచ్చి, వచ్చామా%-%పోయామా అన్న రీతిలో వ్యవహారం సాగుతోందని రోగులు వాపోతున్నారు. డాక్టర్ కుర్చీ వైపు కళ్లుకాయలు కాచేలా ఎదురు చూసినా, ఆ కుర్చీలో డాక్టర్ ఎప్పుడు కూర్చుంటాడో చెప్పలేని పరిస్థితి. తమ ఆరోగ్య సమస్యలు చెప్పుకుందామంటే డాక్టర్ సాహెబ్ కంటికి కూడా కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ ఉంటే సరే, లేకపోతే అక్కడున్న అటెండర్లే డాక్టర్లుగా మారుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. "సార్ ఎప్పుడు వస్తారు?" అని అడిగితే "కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ దగ్గర మీటింగ్‌లో ఉన్నారు" అంటూ సాకులు చెబుతూ, ఎర్ర గోలి%-%పచ్చ గోలి అంటూ మందులు ఇస్తూ రోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాయపర్తి మండలంలో మొత్తం 40 గ్రామ పంచాయితీలు ఉండగా, రాయపర్తి, కొండూరు, కాపువల్లి, కేశవపూరు, మెరిపిరాల, సన్నూరు, దక్కల్, మైలారం, మహబూబ్ నగర్, కొత్తూరు, పేర్కవేడు గ్రామాల్లో 11 పల్లె దవాఖానాలు ఉన్నాయి. వీటిలో మూడు పల్లె దవాఖానాల్లో డాక్టర్లు లేరు. మిగిలిన ఎనిమిది పల్లె దవాఖానాల్లో పనిచేస్తున్న డాక్టర్లే మండల కేంద్రంలోని ఆసుపత్రికి కూడా శరణ్యంగా మారుతున్నారు. వారు తమ గ్రామీణ పల్లె దవాఖానాల్లో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలందిస్తూ, అదే సమయంలో మండల కేంద్రంలోని ఆసుపత్రిలో కూడా సేవలు అందించాల్సి రావడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలా డిప్యూటేషన్ మీద వచ్చిన డాక్టర్లకు నెలనెల జీతాలు మాత్రం భేషుగ్గా అందుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలనుకునే సబ్ సెంటర్ల డాక్టర్లకు మాత్రం తంటాలు తప్పడం లేదు. ఫలితంగా పల్లె దవాఖానాలు నిర్వీర్యమవుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి రాయపర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి శాశ్వత వైద్యుడిని నియమించాలని, తద్వారా పల్లె దవాఖానాల్లో పనిచేస్తున్న డాక్టర్లపై భారం తగ్గించి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

సర్వ మానవాళికి యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్

సర్వ మానవాళికి యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు జిల్లా ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిల సుందరీకరణ పనులు, క్రిస్మస్ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, క్రైస్తవ సంఘాల పెద్దలు, పాస్టర్లతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పేద క్రైస్తవులకు వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందని తెలిపారు. హనుమకొండ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం రూ.4 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే ప్రతి నియోజకవర్గ పరిధిలోని 50 చర్చిల సుందరీకరణకు ఒక్కో చర్చికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యుల ఆధ్వర్యంలో రెండు అనువైన ప్రాంతాల్లో క్రిస్మస్ విందు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో రూ.4.50 లక్షల వ్యయంతో జిల్లాలోని 94 చర్చిలకు తాత్కాలిక లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అన్ని మతాల పండుగలను ఘనంగా నిర్వహిస్తోందని మేయర్ తెలిపారు. యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారని, మానవత్వం, ప్రేమ, క్షమాగుణాలే యేసుక్రీస్తు బోధనల సారమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ మాట్లాడుతూ, క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రభుత్వం మంజూరు చేసిన చర్చిల సుందరీకరణ నిధులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి అధికారులు, క్రైస్తవ పెద్దలు, పాస్టర్లతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి గౌస్ హైదర్, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్, తహశీల్దార్ రవీందర్ రెడ్డి, పాస్టర్స్ టిసిఎఫ్ అధ్యక్షులు బిషప్ జాన్ మార్కండేయ, రెవరెండ్ జోసఫ్ ప్రభాకర్, అడ్వైజర్ కె. కురియన్, టిసిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి-జీవనోపాధి మిషన్‌పై సమగ్ర అవగాహన

రైతులే దేశానికి వెన్నెముక - డా. ఎస్. బిందు మాధురి
కృషి విజ్ఞాన కేంద్రం మామునూరులో ఘనంగా జాతీయ రైతు దినోత్సవ వేడుకలు

మామునూరు, వరంగల్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో రైతులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, అధిపతి డా. ఎస్. బిందు మాధురి అధ్యక్షత వహించి ప్రధాన ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "రైతులే దేశానికి వెన్నెముక. రైతు బాగుంటేనే దేశం ముందుకు సాగుతుంది" అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సమర్థ వినియోగం, సుస్థిర వ్యవసాయ యాజమాన్యం అత్యంత అవసరమని ఆమె వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వాతావరణ అనుకూల వ్యవసాయం, సమగ్ర పంట యాజమాన్యం, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే ఆధునిక సాంకేతికతలను అనుసరించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయాలను తగ్గించి దిగుబడులు పెంచే పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి%-%జీవనోపాధి మిషన్ ప్రాధాన్యతను డా. బిందు మాధురి రైతులకు వివరించారు. ఈ పథకం ద్వారా రైతులు, గ్రామీణ కూలీలకు సంవత్సరానికి 125 రోజుల పని భద్రత కల్పించబడుతుందని, ఉపాధి పనులకు సంబంధించిన వేతనాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు తమ గ్రామాల్లో నీరు%-%నేల సంరక్షణ పనులు, నీటి కుంటల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, వ్యవసాయ నీటి కాల్వల నిర్వహణ వంటి పనులు చేపట్టవచ్చని సూచించారు. దీని వల్ల వ్యవసాయ వ్యయాలు తగ్గడంతో పాటు దీర్ఘకాలికంగా రైతులకు లాభాలు చేకూరుతాయని ఆమె స్పష్టం చేశారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశుపోషణ, మత్స్యకార రంగం, కోళ్ల పెంపకం వంటి జీవనోపాధి మార్గాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణలు, ప్రదర్శనలు మరియు అవగాహన కార్యక్రమాల ద్వారా కృషి విజ్ఞాన కేంద్రం నిరంతర సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. సౌమ్య, డా. రాజు, డా. సాయికిరణ్, డా. గణేష్ వ్యవసాయం, పశుపోషణ, మత్స్యరంగాలకు సంబంధించిన ఆధునిక సాంకేతిక సూచనలు రైతులకు అందించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కీటకాలు%-%వ్యాధుల నియంత్రణ, పశువుల ఆరోగ్యం, చేపల పెంపకంలో లాభదాయక విధానాలపై రైతులు అడిగిన సందేహాలకు వారు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. అలాగే షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేయడం జరిగింది. ఇది గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చే ఉపాధి మార్గంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్స్ హర్ష రెడ్డి, సాయిచంద్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరుతూ కృషి విజ్ఞాన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.

భువనేశ్వర్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన రాజకీయ శాస్త్ర పరిశోధకుడు కల్లేపల్లి ప్రశాంత్

హుస్నాబాద్ / భువనేశ్వర్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ప్రతిష్ఠాత్మక కళింగ విశ్వవిద్యాలయంలో అల్ ఇండియా పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ (ఎఐపిఎస్ఎ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 62వ అంతర్జాతీయ సదస్సుకు సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన రాజకీయ శాస్త్ర పరిశోధక విద్యార్థి కల్లేపల్లి ప్రశాంత్ ఎంపికయ్యారు. ఈ అంతర్జాతీయ సదస్సులో "భారత ప్రజాస్వామ్యానికి సవాళ్లు %-% రాజకీయ పార్టీల పాత్ర" అనే అంశంపై ప్రసంగించే అవకాశం ఆయనకు లభించడం విశేషం. ఈ సదస్సు ఈ నెల 27, 28 తేదీల్లో భువనేశ్వర్‌లో జరగనుంది. కల్లెపల్లి ప్రశాంత్ గతంలో కూడా పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని వివిధ సమకాలీన రాజకీయ అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తూ, ప్రసంగాలు చేసి విశేష గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రాంచంద్రం పర్యవేక్షణలో "తెలంగాణలో షెడ్యూల్ తెగల రిజర్వేషన్ల ప్రభావం" అనే అంశంపై పీహెచ్‌డీ పరిశోధన చేస్తున్నారు. భువనేశ్వర్‌లో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్న ప్రశాంత్‌కు ఈ సందర్భంగా రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు. ఈ ఎంపికతో పొట్లపల్లి గ్రామానికి, హుస్నాబాద్ ప్రాంతానికి గౌరవం దక్కిందని వారు పేర్కొన్నారు.

పెంబర్తి గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ ఈటెల రాజేందర్

హసన్‌పర్తి, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

పెంబర్తి గ్రామ సర్పంచ్‌గా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తాళ్లపల్లి కుమారస్వామికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు, గౌరవనీయులు ఈటెల రాజేందర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజల విశ్వాసంతో లభించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పెంబర్తి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. గ్రామ స్థాయి పాలన బలోపేతమైతేనే సమగ్ర రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. పారదర్శక పాలనతో పాటు ప్రజల భాగస్వామ్యంతో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, విద్యా%-%వైద్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతన సర్పంచ్ నాయకత్వంలో పెంబర్తి గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని అభిలషించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు తీగల భరత్ గౌడ్, రైల్వే బోర్డు మెంబర్ దాసరి రాజు, రమేష్ తదితరులు పాల్గొని తాళ్లపల్లి కుమారస్వామికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన సర్పంచ్‌ను అభినందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కేయూలో గోల్డెన్ జూబిలీ సందర్భంగా రెండు రోజుల జాతీయ సదస్సు

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబిలీ సంవత్సరాన్ని పురస్కరించుకొని సోషల్ సైన్సెస్ మరియు ఆర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ఆయా విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇంటిగ్రేటింగ్ ఎస్.డి.జీస్ ఫర్ వికసిత్ భారత్ ఏ 2047: అచ్చివ్మెంట్స్ అండ్ పాత్ వేస్ " అనే అంశంపై ఈ జాతీయ సదస్సును ఫిబ్రవరి 26, 27 తేదీల్లో విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు డీన్ తెలిపారు. దేశ అభివృద్ధి లక్ష్యాలు, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సాధనలో సామాజిక శాస్త్రాలు, కళల విభాగాల పాత్రపై ఈ సదస్సులో విస్తృత చర్చలు జరగనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సులో పాల్గొనదలచిన విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించాలని కోరారు. సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.kakatiya.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య టి. మనోహర్, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ ఎం. స్వర్ణలత, డాక్టర్ బి. రాధికా రాణి, డాక్టర్ ఆర్. మేఘనా రావు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ సంకేనేని వెంకట్, డాక్టర్ సిహెచ్. రాజ్ కుమార్, డాక్టర్ ఎం. లింగయ్యతో పాటు పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

వీరశైవ సంప్రదాయాలు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

మహాత్మ బసవేశ్వరుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలి : పి. వీరసోమయ్య

హనుమకొండలో వీరశైవ యువజన, మహిళా విభాగాల ఎన్నికలు

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

వీరశైవ సంప్రదాయాలు నేటి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మహాత్మ బసవేశ్వరుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందని హనుమకొండ జిల్లా వీరశైవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి. వీరసోమయ్య అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో వీరశైవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యువజన, మహిళా విభాగాలకు ఎన్నికలను నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు గుండవరపు విధుమౌలి, ఉప్పు భాస్కర్ రావు, శైలేష్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పి. వీరసోమయ్య మాట్లాడుతూ, మహాత్మ బసవేశ్వరుడు సమానత్వం, కులరహిత సమాజం, కష్టపడి పనిచేయడం, నైతిక విలువలను బోధించారని తెలిపారు. వీరశైవ సిద్ధాంతాలు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని, ఆ విలువలను ఆచరణలో పెట్టినప్పుడే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ఈ ఎన్నికల్లో వీరశైవ యువజన కమిటీకి ఉప్పు శివకుమార్ (సునీల్) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉప్పు ఆశిష్, ఉపాధ్యక్షులుగా రాకేష్, టీ. ధనుష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొలగాని సాయి, కోశాధికారిగా రాచర్ల సాయి, సంయుక్త కార్యదర్శులుగా వి. ఉదయకుమార్, మనోజ్, ప్రచార కార్యదర్శిగా వి. మల్లికార్జున్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డి. రాకేష్, పున్నంచందర్, వంశీ, శ్రవణ్, శ్రీకర్‌లు ఎంపికయ్యారు. అలాగే మహిళా విభాగానికి బాణాల శ్రీగౌరి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొలగాని శోభ, వి. సమత, ప్రధాన కార్యదర్శిగా సాయం ఉష, కోశాధికారిగా ఉప్పు సాధన, ప్రచార కార్యదర్శిగా ఉప్పు రజిత, సంయుక్త కార్యదర్శిగా దుర్గం అనిత ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీలత, భాగ్యలక్ష్మి, లావణ్య, పి. నిర్మల, సుహాసిని, కృష్ణవేణిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన యువజన, మహిళా కమిటీ సభ్యులను సంఘం నాయకులు అభినందిస్తూ, వీరశైవ విలువలను సమాజంలో విస్తరించేందుకు కృషి చేయాలని సూచించారు. యువత, మహిళల చురుకైన భాగస్వామ్యంతో సంఘం కార్యక్రమాలు మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దహనకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

వరంగల్, 23 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)

వరంగల్ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ (కేయూ) క్రాస్ రోడ్ వద్ద బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండ, దాడులకు నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా మానవహారం చేపట్టిన అనంతరం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బంగ్లాదేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో మైనారిటీలకు, ముఖ్యంగా హిందువులకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ హిందువులపై జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం వంటి అమానుష ఘటనలను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు ఒంటరివాళ్లు కాదని, వారికి భారత్‌లో ఉన్న కోట్లాది హిందువుల అండ ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. హిందువుల రక్షణ కోసం ఏబీవీపీ దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేస్తుందని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దహనకాండను తక్షణమే ఆపకపోతే ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనిస్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ మాట్లాడుతూ, బంగ్లాదేశ్ ఏర్పాటే భారతదేశ సహకారంతో సాధ్యమైందని గుర్తుచేశారు. అలాంటి దేశంలో హిందువులపై దాడులు కొనసాగితే బంగ్లాదేశ్ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ఇది మౌనంగా చూస్తూ ఉండాల్సిన సమయం కాదని, బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా అందరూ గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ అఖిల భారత సహ సంఘటన మంత్రి బాలకృష్ణ జీ, క్షేత్రీయ సంఘటన మంత్రి శివకుమార్ జీ, తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి విష్ణువర్ధన్ జీ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జానారెడ్డి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు మడూరి సందీప్ కుమార్, నీతూ సింగ్, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, ఆకాష్ బాటి, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి జ్ఞానేశ్వర్‌తో పాటు పెద్ద ఎత్తున ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోత్కూరులో కొత్తపేట ఆనంద్ కుమార్ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం

వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:

వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కొత్తపేట ఆనంద్ కుమార్ సోమవారం గ్రామపంచాయతీలో సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు 10 మంది వార్డు సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. మోత్కూరు గ్రామానికి అనుసంధానమైన తండాలోని భద్య నాయక్ తండా నూతన సర్పంచిగా శంకర్ గ్రామపంచాయతీలో గ్రామస్తుల సమక్షంలో సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. నన్ను ఆశీర్వదించి గెలిపించిన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ తోడుంటానని, గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని, ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ప్రజలు సమక్షంలో ప్రమాణం చేశాడు. బద్య నాయక్ తాండ సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ.. ప్రతి తండాలోని ప్రతి సమస్యకు అడ్డుగా నిలబడతానని, అభివృద్ధిలో తండాలన్ని ముందు ఉండేలా తీర్చిదిద్దుతానని అన్నారు. మోత్కూరు గ్రామ వార్డులోని అన్ని సమస్యలపై స్పందించి, గల్లిగల్లిలో తిరుగుతూ అందరికీ అందుబాటులో ఉంటామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఇక పెల్లవెలుగు ఎలక్ట్రిక్ బస్సులు

ఆర్టీసి అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

గ్రామాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులు కూడా ఎసితో కూడా ఇవి బస్సులను సిద్దం చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఇకపై కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ బస్సులు 'పల్లెవెలుగు'కు చెందినవైనా తప్పనిసరిగా ఏసీవే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టదలచిన 1,450 బస్సులు కూడా ఈవీనే కొనుగోలు చేయాలని సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి జిల్లాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ముందుగా ఏర్పాటు చేయాలని, వీటికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని సూచించారు. ఏపీఎస్ ఆర్టీసీలో ప్రవేశపెట్టే ఈ బస్సుల రోడ్ మ్యాప్‌పై సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

అనుకున్న సమయానికి మేడారం పనులన్నీ పూర్తి చేస్తాం

తాత్కాలికాలు కాదు, శాశ్వత పనులే

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ములుగు జిల్లా, 23 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)

ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క%-%సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు రెండు వందల సంవత్సరాల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా శాశ్వత ప్రాతిపదికన చేపట్టామని, అనుకున్న సమయానికి అన్ని పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మేడారం మహా జాతరను పురస్కరించుకొని చేపట్టిన అభివృద్ధి పనులు ఆదివాసీ గిరిజనుల మనోభావాలకు భంగం కలగకుండా, వారి సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడే విధంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం రాష్ట్ర మంత్రి ధనుసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మేడారంలోని శ్రీ సమ్మక్క%-%సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు, సాండ్ స్టోన్ శిల్పాల లిపి చిత్రాలు, క్యూ లైన్ నిర్మాణం, గోవిందరాజు%-%పగిడిద్దరాజుల గద్దెల నిర్మాణం, ఆలయ ఫ్లోరింగ్ పనులు, ప్రహరీలో వెదురు బొంగు ఆకృతిలో నిర్మిస్తున్న స్తంభాలు, చిలుకలగుట్ట రోడ్డు, స్తూపం, కన్నెపల్లి, జంపన్నవాగు, ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, గుత్తేదారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణ పనులు, రాత్రి నిర్మాణ పనులు, సివిల్ వర్క్స్, గద్దెల చుట్టూ గ్రిల్లుల ఏర్పాటు, ప్రాకారం బయటి వైపు సీసీ రోడ్ల పనులను డిసెంబర్ 31వ తేదీ లోపు, ఇతర పనులను జనవరి 5వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రధాన ద్వారం పనులు కూడా జనవరి 5లోపు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, గద్దెల పరిసరాలు, ఇతర ప్రాంతాల్లో లైటింగ్ పనులు వేగవంతం చేయాలని, రహదారుల ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, హరిత వై జంక్షన్ నుంచి గద్దెల వరకు సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. జాతర సమయంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని, పనులను విభజన చేసుకొని నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జాతరకు వచ్చే అన్ని రహదారుల నిర్మాణం పూర్తిచేయాలని, ఐటిడిఏ ఆధ్వర్యంలో తాత్కాలిక పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా శాశ్వత అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సుందరీకరణ కూడలిలో గ్రాస్ ప్లాంటేషన్, రహదారుల ఇరువైపులా రెవెన్యూ ప్లాంటేషన్ మొక్కల నాటకం చేపట్టాలని అన్నారు. ఈసారి గతంతో పోలిస్తే సుమారు 200 శాతం అధికంగా భక్తులు జాతరకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, అధికారులంతా పట్టుదలతో డిసెంబర్ 31లోపు పనులు పూర్తి చేయాలని, భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్, ఆర్ అండ్ బి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వనదేవతల ఆశీస్సులతో పనులు సాఫీగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ మహా జాతరను మరింత విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా గద్దెల ప్రాంతంలో పాలరాతి శిల్పాలతో పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జనవరి 5వ తేదీ లోపు అన్ని పనులు పూర్తవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న మేడారం మహా జాతరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులు, ప్రతిపక్ష నాయకులను ఆహ్వానిస్తున్నామని, అమ్మవార్ల దీవెనలు దేశ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా 29 ఎకరాల భూసేకరణ చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడుతూ పనులు చేపట్టామని, పాలరాతి శిల్పాలు ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడం వల్ల కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా శిల్పాలు రూపొందిస్తున్నామని, రాబోయే తరాలకు అమ్మవార్ల చరిత్ర తెలిసేలా పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వస్తిక్, గద్దెల నిర్మాణాలు గిరిజన సంప్రదాయాల ప్రకారమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బి, పీఆర్ ఈఎన్‌సీ అధికారులు, ఆర్డీఓ వెంకటేష్, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్టులు, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా జన్నపురెడ్డి ధీరజ్ నియామకం

ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

కేంద్ర ప్రభుత్వం తరపున తెలంగాణ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా జన్నపురెడ్డి ధీరజ్ మంగళవారం నియామకం అవ్వడంతో కుటుంబంలో ఎక్కడ లేని ఆనందం వెల్లివిరిసింది. ఎంతో కష్టపడి చదువుకోవడం పేద ప్రజలకు వీలైనంత సేవ చేయడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసుకునే విధంగా కుటుంబంలోని సేవ గుణం చిన్నప్పటి నుండి అలవర్చుకోవడం ధీరజ్ కు ప్రత్యేక నిదర్శనం. అన్నయ్య జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి తమ్ముడైన ధీరజ్ ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకోవడం కోసం రాయవృత్తిని పేద ప్రజలకు అంకితం చేసే విధంగా ఆయురారోగ్యాలతో ఉన్నతమైన బోష నిర్మించుకుని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. మన జిల్లాకు ఇది గౌరవకరమైన విషయం. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని పలువురు కోరారు.

హసన్‌పర్తిలో ప్రజాస్వామ్య పండుగ!

ఘనంగా నూతన సర్పంచుల ప్రమాణ స్వీకారం
గ్రామాభివృద్ధే లక్ష్యంగా కొత్త పాలనకు శ్రీకారం

హసన్‌పర్తి, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

హసన్‌పర్తి మండలం ప్రజాస్వామ్య సంబరాలకు వేదికైంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల విశ్వాసంతో విజయం సాధించిన నూతన సర్పంచులు సోమవారం అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేసి గ్రామ పాలన బాధ్యతలను చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన లక్ష్యంగా ప్రజల తీర్పుతో ఎన్నికైన సర్పంచులు భారీ సంఖ్యలో ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. నాగారం గ్రామ సర్పంచిగా ఎన్నికైన సందరాజు లావణ్య%-%సంతోష్ దంపతుల ప్రమాణ స్వీకారోత్సవానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అధికార యంత్రాంగంతో సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మడిపల్లి గ్రామ సర్పంచిగా బుర్ర రంజిత్ కుమార్, జయగిరి గ్రామ సర్పంచిగా తాళ్లపెల్లి వెంకటేశ్వర్ల గౌడ్, గంటూరుపల్లి గ్రామ సర్పంచిగా చల్ల రాకేష్ రెడ్డి, సీతంపేట గ్రామ సర్పంచిగా మేక రమ్య భగవాన్ రెడ్డి, అనంతసాగర్ గ్రామ సర్పంచిగా ఆమంచ వెన్నెల దయాకర్లు సహా మండలంలోని వివిధ గ్రామాల నూతన సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకారోత్సవాల సందర్భంగా మిఠాయిల పంపిణీతో పాటు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు రాజకీయాలు%-%పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పాలనతో హసన్‌పర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు, 15 మందికి జరిమాన

వరంగల్, 23 డిసెంబర్ 2023 (జై భీమ్ న్యూస్)

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 23-12-2025న డ్రంకెన్ అండ్ డ్రైవ్‌పై నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన 17 మందిని కోర్టులో హాజరు పరచగా, ఇద్దరికి జైలు శిక్ష విధించి మిగిలిన వారికి జరిమానా విధించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు. గౌరవ మేజిస్ట్రేట్ కె. లక్ష్మీనారాయణ ఎదుట హాజరు పరచిన కేసుల్లో అజ్మీరా సుమన్ (కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా) మరియు కర్ణకంటి రాజు (నిజామాబాద్)లకు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 15 మందికి రూ.12,300 జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురిని కోర్టులో హాజరు పరచగా, వారికి రూ.1,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఇన్స్పెక్టర్ కె. సుజాత తెలిపారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా కార్యాలయాన్ని క్రిస్మస్ అలంకరణలతో ముస్తాబు చేయగా, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, డిటిఓ శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యాలయ సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ కులమతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ అని, మానవత్వం, ప్రేమ, సేవ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. యేసుక్రీస్తు బోధనలు సమాజానికి మార్గదర్శకమని తెలిపారు.క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను, శాంతి%-%సామరస్య సందేశాన్ని సిబ్బందికి వివరించారు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఉద్యోగి ఈ విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ (ఈజీఎస్%-%సెర్ప్), సూపరింటెండెంట్లు, డీపీఎంలు, ఏపీఎంలు తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు పంచుకోవడంతో కార్యక్రమం సంతోషంగా ముగిసింది.

కమలాపూర్‌లో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వ సందేశం

కమలాపూర్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డిసెంబర్ 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపూర్ మండల తహసీల్దార్ సురేష్ మారపాక, కమలాపూర్ సీఐ హరికృష్ణ, ఎస్ఐ దిలీప్, కమలాపూర్ గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్లా శ్రీనివాస్, ఆర్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, స్థానిక ఫాస్టర్లు ఏసుదాస్, ఆనంద్ తో పాటుగా ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రిస్మస్ పర్వదినం కులమతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ అని, ప్రేమ, కరుణ, సేవ, శాంతి, సౌభ్రాతృత్వం వంటి విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని తెలిపారు. యేసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకమని, పరస్పర గౌరవం, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో క్రైస్తవ సోదరులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. కమ్యూనిటీ హాల్‌ను క్రిస్మస్ అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేయగా, కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు పంచుకున్నారు. కమలాపూర్‌లో ఘనంగా నిర్వహించిన ఈ ప్రీ క్రిస్మస్ వేడుకలు శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

కెటిఆర్, హరీస్‌లకు నోటీసులంటూ లీకులు

నల్లగొండ,డిసెంబర్23(జై భీమ్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, సీనియర్ నేత హరీష్ రావుకు నోటీసులు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి లీకులు ఇవ్వడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇస్తామని రేవంత్ రెడ్డి లీకు ఇచ్చిండని జగదీశ్‌రెడ్డి చెప్పారు. వాడు ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి రోజు నుంచి ఫోన్ ట్యాపింగ్ గురించి ఏడుస్తున్నాడని మాజీ మంత్రి విమర్శించారు. కరెంట్ గురించి ఇలాగే ఏడ్చిండని, దానికి సంబంధించిన రిపోర్టు రాగానే సిగ్గుతో మడిచి కనబడని చోట పెట్టుకున్నడని అన్నారు. 'కేసీఆర్ మల్లెపూవు లాగ ఉన్నాడురా.. కాంగ్రెస్, బీజేపీల కంటే గొప్పగా 24 గంటలు కరెంట్ ఇచ్చిండు' అని రిపోర్టులో వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

హోంగార్డుల బదిలీల సమస్యను వెంటనే పరిష్కరించాలి

సీఎం చంద్రబాబు నాయుడికి సీపీఐ లేఖ

హైద్రాబాద్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమితులై ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన హోం గార్డులను స్వరాష్ట్రానికి బదిలీ చేసి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు ఆయన సీఎం కు ఒక లేఖ రాశారు. రాష్ట్ర విభజన అనంతరం అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను వారి స్థానికత ఆధారంగా స్వరాష్ట్రాలకు బదిలీ చేసినప్పటికీ, హోం గార్డుల విషయంలో మాత్రం అన్యాయం జరిగిందని ఆయన లేఖలో పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలుగా హోం గార్డులు ఉద్యోగం తెలంగాణలో, కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లో ఉండే పరిస్థితిలో విధులు నిర్వహిస్తూ మానసిక, ఆర్థిక, రవాణా సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక మంది హోం గార్డులు అధికారిక విధులతో పాటు ఉన్నతాధికారుల నివాసాల్లో అనధికారిక సేవలకు వినియోగించబడుతున్నారని, తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటం వల్ల వారిని చూసుకోలేని పరిస్థితి ఏర్పడిందని రామకృష్ణ పేర్కొన్నారు. పిల్లలు రెండు రాష్ట్రాల్లో చదువుకుంటుండటంతో భవిష్యత్తులో రాష్ట్ర స్థానికత కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హోం గార్డు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ స్థానికత కలిగిన హోం గార్డులకు అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఈ సమస్యను ఇప్పటికే అనేకసార్లు సీఎం, హోం మంత్రి వంగలపూడి అనిత, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారం కాలేదని తెలిపారు. కాబట్టి మానవీయ దృష్టితో స్పందించి, రెండు రాష్ట్రాలకు చెందిన హోం గార్డులను వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేసి, న్యాయం చేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు.

జనవరి 1న ఎన్సీపీ జెండా ఆవిష్కరణ

10 జిల్లాలు, 46 మండలాల్లో పార్టీ విస్తరణకు నిర్ణయం

దమ్మపేట, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

ఎన్సీపీ పార్టీ ఎన్సీపీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సరోజినాపురంలోని మద్దిశెట్టి సామేలు నివాసంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ నిర్మాణం, సిద్ధాంతాలు, గ్రామస్థాయి నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు, మండల%-%జిల్లా కమిటీల బలోపేతంపై చర్చించారు. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి ఎంపికైన 10 జిల్లా కమిటీలు, 46 మండల కమిటీల వివరాలను కేంద్ర ఎన్సీపీ పార్టీ కార్యాలయానికి ఢిల్లీకి పంపించాలని నిర్ణయించారు. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, హనుమకొండ, రంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ తదితర జిల్లాలకు చెందిన క్యాడర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ, ఎన్సీపీ ఎన్సీపీ జాతీయ అధ్యక్షులు ధీరజ్ శర్మ నాయకత్వంలో, ఎన్సీపీ జాతీయ అధ్యక్షులు అజిత్ దాదా ఆశీస్సులతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 1న తెలంగాణ రాష్ట్రంలోని 46 మండలాలు, 10 జిల్లాల్లో ఎన్సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీజీ ఆయిల్ ఫెడ్‌లో 17 మంది రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతులు

హైద్రాబాద్, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఆయిల్ పామ్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (టీజీ ఆయిల్ ఫెడ్)లో రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ చైర్మన్ ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తూ, సంస్థ ప్రతిష్టను మరింత పెంచేలా నిజాయితీతో, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ పదోన్నతులలో భాగంగా పి. ప్రవీణ్ రెడ్డికి మేనేజర్ (ఆయిల్ పామ్ డెవలప్‌మెంట్)గా, కార్తిక్ రెడ్డికి మేనేజర్ (టెక్నికల్)గా, సునీత కుమారికి మేనేజర్ (జనరల్)గా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా పవన్ కుమార్, ప్రణీష్ కుమార్, కార్తిక్, యు.ఎస్. రాజేష్‌లకు డెప్యూటీ మేనేజర్లుగా పదోన్నతి ఇచ్చారు. ఇతర రెగ్యులర్ ఉద్యోగులు కూడా వివిధ కేడర్లలో పదోన్నతులు పొందారు. మొత్తంగా మంగళవారం 17 మంది రెగ్యులర్ ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. పదోన్నతి పొందిన ఉద్యోగులు తమపై నమ్మకం ఉంచిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ టీజీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ శ్రీ జంగా రాఘవ రెడ్డికి, షేక్ యాస్మీన్ బాషా, ఐఏఎస్, మేనేజింగ్ డైరెక్టర్‌కు, అలాగే టీజీ ఆయిల్ ఫెడ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీకి ఘన నివాళులు

మాజీ ప్రధాని సేవలు చిరస్మరణీయం
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు

హన్మకొండ, 23 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)

దేశానికి మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహా రావు అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు అన్నారు. పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఆర్థిక సంస్కరణలకు పీవీ నరసింహా రావు గారే పితామహుడని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టి, దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేసిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, టీపీసీసీ మాజీ కార్యదర్శి బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ అంకుస్, టి. సుమన్, సుగుణాకర్ రెడ్డి, బంక సంపత్, రహమతుల్లా, మానుపాటి శ్రీను, పి. రమేష్, కొండ నాగరాజు, మండల సమ్మయ్య, సరయ్య, రహీమున్నిసా తదితరులు పాల్గొని పీవీ నరసింహా రావుకి ఘన నివాళులు అర్పించారు.

పివి సేవలు చిరస్మరణీయం

నివాళి అర్పించిన కెటిఆర్

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

నవభారత నిర్మాత, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు భారతదేశానికి గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. భారత ప్రధానిగా, ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, సంస్కరణశీలిగా, బహుభాషా కోవిదుడిగా భారతరత్న పీవీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేస్తూ.. పీవీ నరసింహా రావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు చరిత్రాత్మకమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. పీవీ నరసింహా రావును బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని గుర్తుచేశారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని.. నెక్లెస్ రోడ్‌కి, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టింది.. వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపిందన్నారు. పీవీ కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా సామాన్యుడి ఆయుధంగా Jai Bheem TV

పవన్ ఎవరిని బెదరించలనుకుంటున్నారు?

మెడికల్ కాలేజీల దోపిడీ కనిపించడం లేదా మండిపడ్డ మాజీమంత్రి పవన్ కళ్యాణ్

గుంటూరు,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ రాజకీయ ప్రవర్తనపై వ్యంగ్యంగా స్పందిస్తూ, ఆయనది ఓపెనింగ్‌లో ఓవర్ యాక్షన్, ఇంటర్వెల్‌లో డల్, చివరిలో కన్ఫ్యూజన్ అంటూ విమర్శించారు. పవన్ కల్యాణ్‌లో ఎవరినో బెదిరించాలనే భావన కనిపిస్తోందని అంబటి ఆరోపించారు. పవన్‌ను ఎవరైనా విమర్శించారా? లేక వైసీపీపై ఎందుకు దూషణలు చేస్తున్నారని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర ఆరోపణలు చేశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంగా మార్చి వారి జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు అంబటి. ఈ అంశాన్ని ప్రజలకు తెలియజేయడానికి వైసీపీ కోటి సంతకాలు సేకరించిందని తెలిపారు. మెడికల్ కాలేజీల స్కాంలో బాగస్వామ్యం ఉంటే జైలుకు పంపుతామని వైఎస్ జగన్ ఇప్పటికే స్పష్టం చేశారని అంబటి గుర్తు చేశారు. ఈ స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబుతో పదిహేను ఏళ్లు కలిసి ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పడాన్ని అంబటి తప్పుబట్టారు. ప్రపంచంలో ఇంతకాలం ఒప్పందాలు రాసుకునే రాజకీయ పార్టీలు ఉండవని వ్యాఖ్యానించారు అంబటి రాంబాబు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా బియ్యం అక్రమ రవాణా ఆగలేదని, అందులో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వాటాలు వస్తున్నాయంటూ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్ ప్రాణత్యాగానికి సిద్ధమని చెప్పడాన్ని ఎద్దేవా చేస్తూ, ఆయన్ను అల్లూరి సీతారామ రాజుతో లేదా నక్సలైట్‌తో పోల్చడం సరైంది కాదన్నారు. చంద్రబాబు, లోకేష్ అవినీతిలో భాగస్వాములు కాదని పవన్ స్పష్టం

చేయగలరా? అని ప్రశ్నించారు. అమరావతి భూముల స్కాం సహా పలు స్కాంలపై వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని అంబటి హెచ్చరించారు. లోకేష్ తీసుకొచ్చిన రెడ్ బుక్‌కు పవన్ మద్దతు ఇస్తున్నారని, ఆ రెడ్ బుక్‌కు చివరికి వాళ్లే బలయ్యే ప్రమాదం ఉందని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

కేయూలో హోరాహోరీగా యూనివర్సిటీ హాకీ (మెన్) టీమ్ సెలక్షన్స్

హన్మకొండ, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

కాకతీయ యూనివర్సిటీ (కేయూ)లో యూనివర్సిటీ హాకీ పురుషుల జట్టు ఎంపికలు మంగళవారం ఉత్సాహంగా, హోరాహోరీగా జరిగాయి. కేయూ క్రీడామైదానంలో నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ హాకీ సెలక్షన్స్‌లో ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన సుమారు 40 మంది హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య తెలిపారు. సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్‌లో కాకతీయ యూనివర్సిటీ తరఫున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారుల కోసం ముందుగా 15 రోజుల పాటు కేయూ క్రీడామైదానంలో ప్రత్యేక హాకీ శిక్షణ శిబిరం (క్యాంప్) నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్. కుమార్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా జట్టును మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఈ సెలక్షన్స్‌కు సెలెక్టర్లుగా డాక్టర్ కె. సునీల్ రెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాస్, ఎస్.డి. యాసిన్, కె. రాకేష్ వ్యవహరించారు. యూనివర్సిటీ స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ హాకీ సెలక్షన్స్ క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయని నిర్వాహకులు తెలిపారు.

శివనగర్‌లో మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

శివనగర్ మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహ స్థాపన కమిటీ

వరంగల్, 23 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యా ప్రదాత మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహాన్ని శివనగర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు చిర్ర రాజేష్ ఖన్నా, కార్యదర్శి రేణుకుంట్ల శివ తెలిపారు. ఈ విగ్రహ స్థాపనకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని కమిటీ సభ్యులు కలిసి విగ్రహ స్థాపన అంశాన్ని వివరించారు. దీనికి మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందిస్తూ, మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహ ఏర్పాటులో తనవంతుగా అవసరమైన సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ నాయకులు తెలిపారు. మంత్రి కొండా సురేఖని కలిసిన వారిలో మహాత్మా జ్యోతిరావ్ ఫూలే విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు చిర్ర రాజేష్ ఖన్నా, కార్యదర్శి రేణుకుంట్ల శివ, 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిరావ్ ఫూలే సేవలు, ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని, వారి విగ్రహ స్థాపనతో సామాజిక చైతన్యం మరింత పెరుగుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అంబాలా గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురైన కోతికి మానవీయ సేవ

ఉప సర్పంచ్ బోయిని శ్రావణ్ యాదవ్ చొరవతో చికిత్స

అంబాల, 23 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలా గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక కోతికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల మానవీయ స్పందనతో ప్రాణ రక్షణ లభించింది. గ్రామ రహదారిపై వెళ్తున్న ఒక కారు అకస్మాత్తుగా కోతిని ఢీకొనడంతో ఆ కోతికి తీవ్ర గాయాలు ఏర్పడి, నడవలేని పరిస్థితిలో రోడ్డుపక్కనే పడిపోయింది. ఈ సంఘటన విషయం అంబాలా గ్రామ ఉప సర్పంచ్ బోయిని శ్రావణ్ యాదవ్కు తెలియడంతో ఆయన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన కోతికి తక్షణమే వైద్య సహాయం అందించాల్సిన అవసరం ఉందని గ్రహించి, వెటర్నరీ డాక్టర్ కుమార్ను పిలిపించారు. డాక్టర్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని కోతికి ప్రాథమిక వైద్య చికిత్స అందించారు. చికిత్స సమయంలో కోతిని సురక్షితంగా నియంత్రించడం, చుట్టుపక్కల వాహన రాకపోకలను నియంత్రించడం వంటి పనుల్లో గ్రామస్తులు సహకరించారు. ఈ సేవా కార్యక్రమంలో గంద్రకోట మహేందర్, ఎర్రగొల్ల అరవింద్, జలీల్ పాషా, నడిగోటి సాంబయ్య, గంద్రకోట హైమతో పాటు అంబాలా గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని సహాయం అందించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ బోయిని శ్రావణ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రమాదాలకు గురైన జంతువులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జంతువుల పట్ల దయ, మానవత్వం చూపడమే నిజమైన సామాజిక సేవ అని పేర్కొన్నారు. గాయపడిన కోతికి సమయానికి చికిత్స అందించడంతో ప్రస్తుతం దాని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అంబాలా గ్రామంలో జరిగిన ఈ సంఘటన మానవత్వానికి, జీవకారుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

అన్ని శాఖలకు సంబంధించి పాలసీ
క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు
ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగుల వివరాలు ఇవ్వండి
అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి

అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హోచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.'

కర్నాటకలో పరువు హత్య

కూతురును చంపిన తండ్రి

బెంగళూరు,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

కర్ణాటక హుబ్బల్లిలో విషాద సంఘటన చోటు చేసుకుంది. తమ పరువు తీసిందన్న కోపంతో కూతురు గర్భవతి అని చూడకుండా ఆమెపై దాడి చేయడంతో చికిత్స పొందుతూ కన్నుమూసింది. ఈ దారుణ ఘటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. వీరాపుర గ్రామానికి చెందిన మాన్య పాటిల్ (19), వివేకానంద ఇద్దరూ డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారు. వివేకానంద అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు. దాంతో తండ్రి గౌడ పాటిల్ వారి పెళ్లికి నిరాకరించాడు. అంతేకాదు ఆ సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమిస్తే మన పరువు పోతుందని.. అందరూ చావాల్సిందే అని బెదిరించాడు. కానీ, మాన్య మాత్రం తన ప్రియుడిని జూన్ 19న ఒక ఆలయంలో పెళ్లి చేసుకుంది. అనంతరం ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే మాన్య తల్లిదండ్రులను స్టేషన్ కి పిలిచి రాజీ కుదిర్చారు పోలీసులు. కొత్త జంట హవేరీ జిల్లాలో కాపురం పెట్టారు. ఏడు నెలల నుంచి ఎలాంటి గొడవలు లేకపోవడంతో తన తల్లిదండ్రులు అంతా మర్చిపోయారని భావించింది మాన్య. ప్రస్తుతం మాన్య ఆరు నెలల గర్భవతి. హాస్పిటల్‌లో చూపించుకునేందుకు దంపతులు తిరిగి గ్రామానికి వచ్చారు. తన పరువు తీసి అత్తామామ వద్ద ఉన్న విషయం తెలుసుకున్న మాన్య తండ్రి కోపంతో రగిలిపోయాడు. తన బంధువులు వీరన గౌడ మహదేవ గౌడ పాటిల్, అరుణ్ గౌడ పాటిల్‌తో వెళ్లి మాన్య అత్తమామ, భర్తపై పైపులు, రాడ్లతో దాడి చేశారు. వాళ్లను కొట్టవొద్దని అడ్డువచ్చిన మాన్యపై కూడా దారుణంగా దాడి చేయడంతో తీవ్ర గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ కన్నుమూసింది. భర్త, అత్తమామలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం నిందితులు అరెస్ట్ చేశారు.

కెసిఆర్ ధోరణి మార్చుకో

తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు
అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి

ఖమ్మం,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండించారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

రవాణాశాఖ డిప్యూటి కమిషనర్ కిషన్ నాయక్ అరెస్ట్

రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

రవాణాశాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఉదయం 5గంటల నుంచి సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో 3 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్ లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని, బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని బంధువు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కిషన్ నాయక్ కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు తెలుసుకుంటామని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

తీర్మలాయపల్లి సెమీ క్రిస్మస్

తీర్మలాయపల్లి, జై భీమ్ న్యూస్

తీర్మలాయపల్లి IPC చర్చిలో 23-12-2025 (మంగళవారం) సాయంత్రం నిర్వహించిన సెమీ క్రిస్మస్ సందర్భంగా, జైభీమ్ పత్రిక చైర్మన్ డాక్టర్ బరిగెల శివ బ్లాంకెట్లను స్పాన్సర్ చేయగా, వాటిని చర్చి పరిధిలోని పేదలు మరియు గ్రామంలోని అవసరమైన కుటుంబాలకు పంపిణీ చేశారు. చలికాలంలో పేదలకు ఉపశమనం కలిగించిన ఈ సేవా కార్యక్రమం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకొచ్చిన డాక్టర్ బరిగెల శివ గారి సేవా మనసుకు చర్చి నిర్వాహకులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన స్థానిక సంఘ కాపరి పాస్టర్ డేవిడ్ తాళ్ళపల్లి మరియు సంఘ నిశ్వాసుల సహకారం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. అలాగే ఈ సేవా కార్యక్రమానికి మద్దతుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ బరిగెల బాబు, మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మాజీ సర్పంచ్ వశపాక కుమారస్వామి గార్ల సహకారం కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని అందించింది. సమాజ సేవే లక్ష్యంగా జైభీమ్ పత్రిక చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రత్నాకర్, అభిషేక్, చిన్నబాబు, లస్కర్ సింగారం యోహాన్ IPC చర్చి సెక్రటరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమవసలదారులకు ట్రంప్ గాలం

స్వచ్ఛందంగా అమెరికా వీడే వారికి 3వేల డాలర్ల తోపా
విమాన ప్రయాణం కూడా ఉచితమే

వాషింగ్టన్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వారికి గతంలో ప్రకటించిన ఓ ఆఫర్‌ను భారీగా పెంచింది. అమెరికా వీడేందుకు అంగీకరించిన వారికి ఇస్తామన్న స్టైఫండ్‌ను మూడు వేల డాలర్లకు పెంచినట్లు పేర్కొంది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని తెలిపింది. ఈ హాలీడే ఆఫర్ ఈ ఏడాది చివరి వరకు మాత్రమేనని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది.డీహెచ్ఎస్ ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి 19లక్షల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశాన్ని వీడిపోయారని సమాచారం. వీరిలో కొన్ని వేల మంది సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించు కున్నట్లు తెలిసింది. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తొలి ఆరు నెలల్లోనే 1.5లక్షల మందిని బహిష్కరించగా.. దాదాపు 13వేల మంది స్వచ్ఛందంగా వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, ఈ గణాంకాలకు సంబంధించి అధికారిక సమాచారం వెలువడలేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వందలాది మందిని అరెస్టు చేస్తోంది. అనంతరం వారిని నిర్బంధ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛందంగా అమెరికా వీడాలనుకునే వారికి ప్రోత్సాహకంగా వెయ్యి డాలర్లు ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈ ఏడాది మేలో ప్రకటించింది. ఇందుకోసం కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ హోమ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. అటువంటి వారిని నిర్బంధించాల్సిన అవసరం లేకుండా చూస్తామని, బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొంది. అంతేకాదు వారిపై విధించిన జరిమానాలపైనా మినహాయింపు ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం అందిస్తోన్న ఈ ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోని అక్రమ వలసదారులకు అరెస్టు, బహిష్కరణ మాత్రమే మార్గమని డీహెచ్ఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు అటువంటి వారికి అమెరికాకు మళ్లీ తిరిగి వచ్చే అవకాశమే ఉండదని స్పష్టం చేస్తున్నారు.

మాట తూలిన నటుడు శివాజీ

విమర్శలు రావడంతో క్షమాపణలు

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

స్త్రీల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు దుమారం చెలరేగడంతో క్షమాపణలు చెప్పారు. మంచి మాటలు చెప్పే ఉద్దేశంలో రెండు అసభ్య పదాలు దొర్లాయని, వాటి వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లోనే ఉంటుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదిక వీడియో విడుదల చేశారు. ఇటీవల పలువురు హీరోయిన్స్ ఇబ్బంది పడిన సందర్భాన్ని ఉద్దేశిస్తూ 'దండోరా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడాను. నాలుగు మంచి మాటలు చెబుతూనే రెండు అసభ్య పదాలను ఉపయోగించా. వాటి వల్ల ఎవరికైనా మనోభావాలు దెబ్బ తింటాయి. నేను మాట్లాడింది అమ్మాయిలందరినీ ఉద్దేశించి కాదు. 'బయటకు వెళ్లినప్పుడు మంచి దుస్తులు వేసుకుని ఉంటే మీకు ఈ ఇబ్బంది ఉండేది కాదేమోనమ్మా' అనే ఉద్దేశం తప్ప, ఎవరినీ అవమాన పరచాలని కాదు. ఏదైనా రెండు అసభ్య పదాలు దొర్లాయి. అందుకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నా. స్త్రీ అంటే శక్తి. నేను అమ్మవారిగా భావిస్తా. ప్రస్తుత సమాజంలో మహిళను తక్కువగా చూస్తున్నారు. అటువంటి అవకాశం ఇవ్వవద్దని చెప్పే ఉద్దేశంతో ఊరి భాష మాట్లాడా. ఆ పదాలు దొర్లకుండా ఉంటే బాగుండేది. ఒకటి మాత్రం చెబుతున్నా, మంచి చెప్పాలనే ఉద్దేశం తప్ప, ఇందులో ఎవరినీ అవమానపరచాలని, కించపరచాలని ఉద్దేశం నాకు లేదు. ఇండస్ట్రీలో మహిళల మనోభావాలు దెబ్బతిని ఉంటే మీ అందరికీ మరోసారి క్షమాపణలు అంటూ ఎక్స్‌వేదికగా నటుడు శివాజీ తెలిపారు.

వారణాసిలో అద్భుతమైన జర్నీ

నటిస్తున్నందుకు గర్వంగా ఉందన్న ప్రకాశ్ రాజ్

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ 'వారణాసి' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ మూవీలో విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందుకు సంబంధించిన అప్‌డేట్‌ను ఆయన స్వయంగా పంచుకున్నారు. ఇందులో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. వారణాసి' అద్భుతమైన షెడ్యూల్ ముగిసింది. నాలో నటుడి ఆకలిని తీర్చింది. ఎస్.ఎస్.రాజమౌళి, మహేశ్‌బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రాలకు థ్యాంక్స్. మీతో పనిచేయడం ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చింది. తర్వాతి షెడ్యూల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' చిత్రంలో ప్రకాశ్‌రాజ్ కనిపించారు. ఇక మహేశ్‌బాబుతో ఆయనది హిట్ కాంబినేషన్. 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకూ వీరిద్దరూ కలిసి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించారు. వారణాసి'లో మహేశ్‌బాబు తండ్రి పాత్రలో ప్రకాశ్‌రాజ్ కనిపిస్తారని టాలీవుడ్ టాక్. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు. ఏడాది కాలంగా ఈ మూవీ షూటింగ్ జరుగుతోందని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇటీవల వెల్లడించారు. మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ జరుగుతుందని హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్‌తో అన్నారు. మరోవైపు టైటిల్‌తో పాటు, ఈ చిత్ర కథా నేపథ్యాన్ని తెలిపేలా విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని నడిపిన ధీశాలి

పికి నివాళి అర్పించిన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండ,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా హనుమకొండ లోని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన నాయకుడు పీవీ నర్సింహారావు అని అన్నారు. యువత పీవీ నర్సింహారావు జీవితం నుంచి క్రమశిక్షణ, సహనం, దేశభక్తిని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాడితల సతీష్‌కుమార్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ రాష్ట్ర కార్యదర్శి పులి రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈ నెలాఖరు నుంచే కుటుంబ సర్వే
ప్రజల సమగ్ర వివరాలు సేకరణ
ప్రభుత్వ పథకాల పారదర్శక అమలుకు నిర్ణయం

అమరావతి,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ వ్యాప్తంగా ఈనెలాఖరు నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు సేకరించనుంది. ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా సమగ్ర సర్వే నిర్వహణ చేయనుంది. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అమలు కోసం ఈ సర్వే చేయనుంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో ఖచ్చితంగా నమోదు చేసేలా చూడటం ఈ సర్వే లక్ష్యం. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను సకాలంలో అందించడానికి ఈ సర్వే చేస్తోంది. అలాగే ఈ సర్వే ద్వారా ప్రజాసేవల పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరచనుంది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబ ప్రస్తుత పరిస్థితిని ధ్రువీకరించడానికి, నవీకరించడానికి ప్రభుత్వ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి అర్హత కలిగిన ఏ కుటుంబం లేదా వ్యక్తి తప్పించుకోకుండా చూడటమే ఈ సర్వే ముఖ్య లక్ష్యం. ఖచ్చితమైన నూతనంగా తీసుకున్న కుటుంబ రికార్డులు ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆమోదాలను జారీ చేయడానికి సమయం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా అన్ని విభాగాల్లో అనవసరంగా ఉన్న వాటిని ధ్రువీకరించాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ సమాచారం ఖచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపరచడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి దగ్గర నవీకరించడం ద్వారా ప్రభుత్వ విధానాలను, పథకాలను మరింత సమర్థవంతంగా ప్లాన్ చేసి అమలు చేసే అవకాశం ఉందని అనుకుంటుంది. సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తు సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనను మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. ప్రభుత్వ సిబ్బంది ఈ సర్వేను ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించనున్నారు. తద్వారా సమాచారం త్వరగా, ఖచ్చితంగా నమోదు చేయనున్నారు. సాధ్యమైన ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన రికార్డులను, సమాధానాలను ముందస్తుగా పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు. తద్వారా ప్రతి కుటుంబానికి పట్టే సమయం తగ్గనుంది. ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించి గుర్తింపు ధ్రువీకరణను సురక్షితంగా నిర్వహిస్తారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతూ రికార్డులు సరైనవని నిర్ధారించనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా పని చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. పౌర కేంద్రీకృత పాలన దిశగా ఏకీకృత కుటుంబ సర్వే ఒక ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం అనుకుంటుంది. సర్వేయర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా, పౌరులు తమ కుటుంబ వివరాలు అలాగే ఉన్నాయని, వారు ప్రభుత్వ సేవలను సజావుగా పొందుతున్నారని నిర్ధారించుకోవడంలో సహాయపడుతుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సేవల పంపిణీని మెరుగుపరచడానికి, జీవన నాణ్యతను పెంచడానికి డిజిటల్ టెక్నాలజీ, ప్రజా - స్నేహపూర్వక విధానాలను ఉపయోగించేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు

అమరావతి,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచనలు ఇచ్చారు. ఏపీ వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. ధాన్యం కొనుగోళ్లతో సహా వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు సీఎం చంద్రబాబు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానం మేరకు తక్షణమే చర్యలు ఉండాలని నిర్దేశిరచారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోళ్లు చేసే మిల్లర్లు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు.. ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు ఉండాలని దిశానిర్దేశర చేశారు. పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. 7,8,9 తరగతులు చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 జనవరి చివరిలో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆ సమ్మిట్‌లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దామని సీఎం చంద్రబాబు సూచించారు.

హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులు

ఉద్యోగుల జీతాల ఆధారంగా ప్రాధాన్యం
ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్

వాషింగ్టన్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

విదేశీ ఉద్యోగులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులకు అమెరికా ఇప్పటికే సిద్ధమైంది. దీనికి సంబంధించి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించగా.. వాటిపై తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తోంది. ఈ మేరకు ఇమిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్ నివేదికను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం ఈ కొత్త మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా.. ఇకపై వెయిటెడ్ సెలక్షన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీని ప్రకారం.. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటివి చేయనున్నారు. అంటే.. ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసాలు ఎక్కువగా దక్కే అవకాశం ఉంది. ఫెడరల్ నిబంధనల మార్పుల పక్రియలో ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ సమీక్షను చివరిదశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారు చేసి వాటిని ప్రకటిస్తారు. వీలైనంత త్వరగా ఈ రివ్యూను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించిన అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది నుంచే హెచ్-1బీ వీసాల జారీకి ఈ కొత్త నిబంధనలను అమలుచేయాలని అమెరికా సర్కారు భావిస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు.

బంగారం వెండి ధరలు మరంత దూకుడు

భారీగా పెరిగిన ధరలు

హైదరాబాద్,డిసెంబర్23(జై భీమ్ న్యూస్):

పసిడి ధరల పరుగు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. రోజురోజుకూ పెరగడమే తప్ప తగ్గడం జరగడం లేదు. దేశీయంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర ఒక్కరోజులోనే రూ.2,650 మేర పెరిగి రూ.1,40,850కు చేరింది. సోమవారం 99.9 స్వచ్ఛత కలిగిన పసిడి రూ.1,38,200గా ఉంది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం సాయంత్రానికి 10 గ్రాముల ధర రూ.1,40,820 పలుకుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే బంగారం రూ.61,900 పెరిగింది. 2024 డిసెంబర్ 31న 10 గ్రాముల పసిడి రూ.78,950గా ఉండగా.. నేడు 78 శాతం పెరిగి రూ.1.50 లక్షల దిశగా దూసుకెళ్తోంది.మరోవైపు వెండి కూడా సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. దిల్లీలో కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.2,750 పెరిగి రూ.2,17,250కి చేరింది. ఈ ఒక్క క్యాలెండర్ సంవత్సరంలో వెండి దాదాపు రూ.1,27,550 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31 నాటికి కిలో వెండి ధర రూ.89,700గా ఉంది. అంటే దాదాపు 142.2 శాతం వృద్ధి నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 4,500 డాలర్లకు సమీపించడంతో దేశీయంగా అదే స్థాయిలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు వెండి సైతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు తొలిసారి 70 డాలర్ల మార్కు దాటింది.వచ్చే ఏడాది మరోసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత పెడుతుందన్న అంచనాలతో సురక్షిత పెట్టుబడి సాధనాలుగా మదుపర్లు భావిస్తుండడంతో బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. దీనికి భౌగోళిక అనిశ్చితులు కూడా తోడయ్యాయని పేర్కొన్నారు. అమెరికా మూడో త్రైమాసికానికి సంబంధించి వెలువడే రెండో అంచనాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉందని అనలిస్టులు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక పరిస్థితిపై అంచనాలతో పాటు, ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్ నిర్ణయాలపై ఇది ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

శివాజీ వ్యాఖ్యల రచ్చ

హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై శివాజీ వ్యాఖ్యలు

దుమారం రేపుతున్న నటుడి కామెంట్స్

హీరోయిన్‌ల అందం వాళ్లు వేసుకునే డ్రెస్‌లలో ఉంటుందని నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. నిండుగా దుస్తులు వేసుకుంటేనే గౌరవం ఉంటుందన్న ఆయన వ్యాఖ్యలపై పలువురు సెలబ్రిటీలు మండిపడుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'దండోరా' ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శివాజీ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఈవెంట్‌లో యాంకర్ డ్రెస్ సెన్స్ బాగుందని చెప్పిన శివాజీ హీరోయిన్‌ల దుస్తుల గురించి మాట్లాడారు. నటీమణులు కొంచెం డ్రెస్ సెన్స్ పాటించాలి. ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దు. మీ అందం మొత్తం నిండుగా వేసుకొనే దుస్తుల్లోనే ఉంటుంది. ఫ్యాషన్ దుస్తులు వేసుకున్నప్పుడు అందరూ బాగున్నాయనే అంటారు. కానీ, లోపల తిట్టుకుంటారు. స్త్రీ అంటే ప్రకృతి. ఎంత అందంగా ఉంటే అంత గౌరవం పెరుగుతుంది మా అమ్మ.. అంటే నటి సావిత్రి ఇప్పటికీ నిండైన రూపంతో గుండెల్లో కనబడుతూ ఉంటుంది. అప్పట్లో సౌందర్య ఈ జనరేషన్‌లో రష్మిక చక్కగా ఉంటారు. గ్లామర్ ఉండాలి.. కానీ దానికి ఒక హద్దు ఉండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు. ప్రపంచ వేదికలపై కూడా చీర కట్టులో వచ్చినవారికే విశ్వసుందరి కిరీటాలు వచ్చాయని శివాజీ అన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలు దుమారం రేపాయి. డ్రెస్సుల గురించి చులకనగా మాట్లాడారని మండిపడుతున్నారు. ఆయన మాట్లాడుతూ నేటితరం హీరోయిన్ల గ్లామర్ ప్రదర్శనపై ఘాటు విమర్శలు చేశారు. 'స్త్రీ అందం చీరకట్టులో, ఒళ్లు కనిపించకుండా వేసుకునే బట్టల్లోనే ఉంటుంది. అలా కాకుండా అభ్యంతరకరంగా బట్టలు వేసుకుంటే అందులో విలువేముంటుంది? అని శివాజీ అన్నారు.

దులిపేసిన సింగర్ చిన్మయి
మా బాడీ..మా ఇష్టం అన్న అనసూయ
శివాజీ తరపునే నేను క్షమాపణలు చెబుతున్నా: మనోజ్

నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది. సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది.
అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది.

ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. నటుడు శివాజీ వ్యాఖ్యలపై ఇప్పటికే సింగర్ చిన్మయి స్పందించగా.. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా శివాజీకి గట్టి కౌంటర్‌ను ఇచ్చింది. అనసూయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ.. ఇది మా బాడీ.. మీది కాదు. మాకు నచ్చినట్లు మేం ఉంటాం అంటూ శివాజీకి కౌంటర్ ఇచ్చారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తప్పని శివాజీ వ్యాఖ్యలను పలువురు తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇప్పటికే సింగర్ చిన్మయి, అనసూయ శివాజీని విమర్శించగా.. తాజాగా మంచు మనోజ్ కూడా శివాజీ పేరు ఎత్తకుండానే ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మనోజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక లేఖ విడుదల చేశాడు. మహిళల దుస్తుల విషయంలో నీతులు చెప్పడం, వారిపై నైతిక బాధ్యత లేదు అని ఆరోపించడం అనేది చాలా పాత కాలపు ఆలోచన. ఇలాంటి వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశను కలిగించాయని మనోజ్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ అనేవి చర్చించలేని అంశాలని మహిళల బట్టలపై తీర్పు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చి చెప్పారు. మహిళలను కించపరిచేలా వస్తువులుగా చూస్తూ మాట్లాడిన ఆ సీనియర్ నటుడి తరపున నేను క్షమాపణలు చెబుతున్నాను. పబ్లిక్ ఫిగర్స్‌గా ఉన్నవారు సమాజంపై తమ మాటల ప్రభావం ఉంటుందని గుర్తించి బాధ్యతగా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హీళలకు ఎప్పుడూ గౌరవం, సమానత్వం దక్కాలి. ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదు. మనోజ్ కుమార్ తన పోస్ట్‌ను ముగించాడు.

రవిబాబు మరో ఆసక్తికర సినిమా

నేడు వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

క్రియేటివ్ డైరెక్టర్ రవిబాబు మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచే ప్రకటన చేశారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమా థియేటర్లకు కాకుండా నేరుగా ఈటీవీ విన్ ఓటీటీలో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఇప్పుడు రవిబాబు తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేస్తూ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ కొత్త సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ పోస్టర్ చూడగానే ఇది సాధారణ సినిమాకాదు, పూర్తిగా భిన్నమైన కథతో రూపొందుతున్న సినిమా అనే ఫీలింగ్ కలుగుతోంది. వింతగా, మిస్టీరియస్‌గా ఉన్న పోస్టర్ సినిమా క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉండబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. రవిబాబు స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమా కూడా కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనుందనే అంచనాలు మొదలయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం ఉదయం 10:30 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమా టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను ఒకేసారి బయటపెట్టనున్నారు. దీంతో రవిబాబు అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ అప్డేట్ కోసం ఆసక్తి నెలకొంది.ఈ ప్రాజెక్ట్‌ను ప్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఈ రెండు ప్రతిష్టాత్మక బ్యానర్లు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం సినిమాపై మరింత నమ్మకాన్ని పెంచుతోంది. కంటెంట్‌కు పెద్దపీట వేసే ఈ బ్యానర్ల నుంచి ఒక నాణ్యమైన సినిమా రాబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు డిఫరెంట్ కాన్సెప్ట్స్, వినూత్న కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రవిబాబు, ఈసారి కూడా అదే స్థాయిలో ఒక కొత్త క్రైమ్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలుస్తోంది.

బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారం

సిఐడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి

నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ అందిన పారితోషికం మరియు కమిషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

ఎఐతో పెళ్లి వీడియో

అభిమానులను ఆట పట్టించిన జగపతిబాబు



టాలీవుడ్‌లో శోభన్ బాబు తర్వాత అంతటి ఫ్యామిలీ హీరో ఇమేజ్ సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. వరుస సూపర్ హిట్ చిత్రాలతో మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఆయన, సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఊహించని స్థాయిలో సత్తా చాటుతున్నారు. అలాంటి సీనియర్ హీరో తాజాగా తన ఇంట్లో ఒక పెద్ద శుభకార్యం జరిగిందంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తన రెండో కూతురి పెళ్లి జరిగిపోయిందంటూ జగపతి బాబు షేర్ చేసిన వీడియో నెట్టింట వేగంగా వైరల్ అయింది. సాధారణంగా సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే భారీ ఏర్పాట్లు, ఆర్భాటం ఉంటాయి. కానీ జగపతి బాబు మాత్రం చాలా సింపుల్‌గా మా రెండో అమ్మాయి పెళ్లయి పోయిందోచ్ అంటూ వీడియోను షేర్ చేయడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. నిజంగానే పెళ్లి జరిగిందా? లేక సరదాగా చేసిన పోస్టా? అన్న సందేహాలు నెటిజన్లలో మొదలయ్యాయి. ఈ సస్పెన్స్‌కు క్లారిటీ వచ్చింది. జగపతి బాబు షేర్ చేసిన వీడియో అసలు నిజమైన పెళ్లి వీడియో కాదు. అది పూర్తిగా ఏఐ టెక్నాలజీతో రూపొందించిన క్రియేటివ్ కంటెంట్ అని తేలింది. టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందో చూపించడమే కాకుండా, తన అభిమానులను సరదాగా ఆటపట్టించాలన్న ఉద్దేశంతోనే ఈ వీడియోను షేర్ చేసినట్లు తెలుస్తోంది. జగపతి బాబు ఇప్పటికే తన పెద్ద కూతురు పెళ్లిని చాలా నిరాడంబరంగా, విదేశీయుడితో జరిపించిన విషయం తెలిసిందే. అలాగే తన పిల్లల విషయంలో ఆయన ఎంతో స్వేచ్ఛనిచ్చే తండ్రిగా కూడా పేరుంది. గతంలో ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తన రెండో కుమార్తెకు పెళ్లి చేసుకోవాలన్న ఆసక్తి లేదని, అది పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని ఆయన స్పష్టంగా చెప్పారు. 'నా పిల్లలు ఏం చేయాలనుకుంటారో అది వారి ఇష్టం. పెళ్లి అనేది వారి ఛాయిస్. నేను ఎప్పుడూ ఒత్తిడి చేయను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో ప్రశంసలు అందుకున్నాయి.మొత్తానికి పెళ్లి కబురు అనుకుని సంబరపడ్డ అభిమానులకు ఇది ఒక స్వీట్ షాక్‌గా మారింది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM